క్లుప్తంగా

ఆకట్టుకున్న భరతనాట్యం



భరతనాట్యం చేస్తున్న యువతులు

మునగపాక: మండల కేంద్రం మునగపాకలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన భరతనాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. మహాశివ రాత్రి పర్వదిన సందర్భంగా పంచాయతీ కార్యాలయం ఆవరణలో వేదపండితులు వెలవలపల్లి కోటేశ్వర శర్మ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు గ్రామస్తులు తరలివచ్చారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మునగపాక: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరుతూ గణపర్తి, గంటవానిపాలెం, మునగపాక,పల్లపు ఆనందపురం తదితర గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందుగా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని యలమంచిలి సీఐ గపూర్ తెలిపారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. ఎస్ఐ పి.ప్రసాదరావుతో పాటు పలువురు పోలీసులు కవాతులో పాల్గొన్నారు.

వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరాలో మార్పులు

పాయకరావుపేట: పట్టణంలోని 132 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా టైంలో మార్పులు చేసినట్టు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రెండు రోజులు వ్యవసాయ బోర్లకు తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు విద్యుత్ సరఫరా చేయనున్నట్టు తెలిపారు. ఉదయం 9 గంటల తరువాత నుంచి త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

65 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఎస్.రాయవరం: అందరూ ఆరోగ్యసూత్రాలు పాటించడంతో పాటు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని కొరుప్రోలు ఆయుర్వేద వైద్యులు సుజాత తెలిపారు. పెద గుమ్ములూరులో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పక్షులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ

అనకాపల్లి : పక్షులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ఈనెల 17న స్థానిక గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు దేవాలయాల ఆవరణలో ఉదయం 8 గంటల నుంచి పక్షులకు తిండి గింజలు, అవి నీరు తాగేందు మట్టి పాత్రలు, పక్షుల గూళ్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ప్రతి ఏడాది వేసవిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు ఉరుసు మహోత్సవం

కశింకోట : మండలంలోని చింతలపాలెంలో వెలసిన హజరత్ కాలేషా బాబా దర్గా 72వ ఉరుసు షరీఫ్ (చందనోత్సవం) శనివారం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు జెండా ప్రతిష్ఠాపన, సాయంత్రం చందనోత్సవ ఊరేగింపు, ఫాతిహా నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్‌గౌస్ తెలిపారు.

24 మద్యం సీసాలు స్వాధీనం

కశింకోట : మండలంలోని మోసయ్యపేటలో24 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వినోద్‌బాబు తెలిపారు. ఈ ఘటనలో దుడ్డేటి చిన రమణను అరెస్టు చేశామన్నారు.

హరహర మహాదేవ

- భక్తిశ్రద్ధలతో శివరాత్రి పూజలు, అభిషేకాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- గ్రామగ్రామాన వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

పంచాక్షరి మంత్రోచ్చారణతో శివాలయాలు మార్మోగాయి. నదులు, సముద్ర తీరాల్లో పుణ్యస్నానాలు, ఇళ్లు, ఆలయాల్లో రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు, ఉపవాసాలు, జాగరణలతో గ్రామగ్రామాన ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. మహా శివరాత్రి సందర్భంగా శైవాలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామునుంచే పెద్ద ఎత్తున వెళ్లి మహాదేవుని దర్శించుకున్నారు.



వెల్చూరులో నాగ లింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు



మునగపాక లింగరాయిగుడిలో అభిషేకాలు చేస్తున్న భక్తులు



గోకివాడలో స్వయంభూ శివలింగం వద్ద భక్తులు



దిమిలిలో నగ్న లింగేశ్వరస్వామి సన్నిధి



వాడ్రాపల్లిలోని దక్షిణేశ్వరుని ఆలయంలో శివలింగం



చీమలాపల్లిలో పూజలందుకున్న నందీశ్వరుడు




పాయకరావుపేట తీర ప్రాంతంలో బందోబస్తు ఏర్పాటు చేసిన మెరైన్ పోలీసులు



మంగవరంలో సప్తాహం నిర్వహిస్తున్న భజన బృందం



అమలాపురం శివాలయంలో స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



ఏటికొప్పాక ఆలయంలో పూజలందుకుంటున్న ముక్కంటి

రాంబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా దిమిలిలో చారిత్రక స్వయంభూ నగ్న లింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గోకివాడలో స్వయంభూ శివలింగం వద్ద రాంబిల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత పిన్నంరాజు చంటిరాజు, ఆయన కుమారుడు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్‌రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్న సమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. వెల్చూరు, కొత్తూరు, కట్టుబోలు, మురకాడ, లాలంకోడూరు తదితర గ్రామాల్లోనూ ప్రత్యేక పూజలు , అభిషేకాలు నిర్వహించారు. కొత్తపట్నంలో గౌరీపరమేశ్వరులు, ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో దక్షిణేశ్వర, టి.సిరసపల్లిలోని వీరభద్రస్వామి, నాగులాపల్లిలోని పురాతన శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మునగపాకలోని సాంబశివుడు ఆలయం, లింగరాయి గుడి, భీమేశ్వర పాలేశ్వరస్వామి ఆలయాల్లో ఉదయం అభిషేకాలు నిర్వహించారు. వాడ్రాపల్లి, నాగులాపల్లి శివాలయాల వద్ద మధ్యాహ్నం భారీ అన్న సమారాధనలు జరిపారు.

అచ్యుతాపురం: మండలంలో మహా శివరాత్రి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి.తెల్లవారు జాము నుంచే శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నునపర్తి, పూడిమడక, ఎంజేపురం, దోసూరు, హరిపాలెం, పెదపాడు, అచ్యుతాపురం, ఆవసోమవరంతో పాటు పలు గ్రామాల్లోని శివాలయాల్లో శివనామస్మరణతో మార్మోగిపోయాయి.

పాయకరావుపేట : శివరాత్రి సందర్భంగా మండలంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గోపాలపట్నం వద్ద సీతమ్మవారి కొండపై వెలసిన శ్రీఉమా ధర్మలింగేశ్వరస్వామిని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యని శ్రీధర్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈయనతో పాటు ఉమ్మడి విశాఖ జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, ఎంపీటీసీ కొంతం నరేష్, నీలాపు బాలకృష్ణారెడ్డి ఉన్నారు.

- మహాశివరాత్రి సందర్భంగా మంగవరంలో సప్తాహం నిర్వహించారు. ఏడు రోజుల పాటు సప్తాహం నిర్వహించి, శివరాత్రి నాడు ముగించారు. 29 సంవత్సరాలుగా శివరాత్రి సందర్భంగా గ్రామంలో సప్తాహం నిర్వహిస్తున్నారు.
- మహాశివరాత్రి సందర్భంగా సముద్రతీర ప్రాంతంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్టు మెరైన్ పోలీసు సీఐ డి.వి.జె. రమేష్ కుమార్ తెలిపారు. ప్రతి సంవత్సరం పాయకరావుపేట మండలంలో పెంటకోట, కొర్లయ్యపేట, గజపతినగరం, పాల్మన్‌పేట తదితర సముద్ర తీర ప్రాంతాల వద్ద, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లోని తీరప్రాంతాల్లో రెండు లక్షల మందికి పైగా భక్తులు సముద్ర స్నానాలు ఆచరిస్తారన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 150 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశామని చెప్పారు.

నక్కపల్లి: మండలంలోని ఉపమాకలో లక్ష్మణేశ్వరాలయం, ఒడ్డిమెట్టలో కాశీవిశ్వేశ్వరాలయం, గొడిచర్ల శేషలింగేశ్వరాలయాల్లో,పాటిమీద శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాచీన శివాలయం ఉపమాకలో ఉన్న శ్రీభువనేశ్వరి సమేత లక్ష్మణేశ్వరాలయానికి వచ్చిన భక్తులు ముందుగా బందుర సరస్సులో స్నానమాచరించి స్వామివారిని దర్శించున్నారు.స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామాల్లో ఊరేగించారు. ఆలయాల్లో స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు.అనంతరం అన్న సమారాదన కార్యక్రమాలు జరిగాయి.

యలమంచిలి రూరల్/ యలమంచిలి: శివరాత్రి సందర్భంగా పట్టణం, మండలంలోని శైవక్షేత్రాలకు భక్తులతో పోటెత్తారు. ఏటికొప్పాక శివాలయంలో అర్చకులు అభిషేకాలు జరిపించారు. కొక్కిరాపల్లి ప్రాచీన శివాలయంలో తెల్లవారుజామునుంచే ప్రధాన అర్చకుడు ఆనివెళ్ల శ్రీనివాసశర్మ అభిషేకాలు నిర్వహించారు. యలమంచిలి పట్టణంలోని త్రిమూర్తులు ఆలయం, బైపాస్ రోడ్డులో సోమస్కంధమూర్తి ఆలయం, శేషుగెడ్డ శివాలయంలో అభిషేకాలు నిర్వహించారు.పలుచోట్ల భక్తులకు ఉచితప్రసాదం,అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. కొత్తపేట రామలింగేశ్వరస్వామి ఆలయం, సోమలింగపాలెం శివాలయంలో రుద్రాభిషేకాలు నిర్వహించారు. యలమంచిలి పట్టణంలోని గొల్లలకొండపై దీపోత్సవంలో పలువురు భక్తులు స్వచ్ఛందంగా పాల్గొని దీపాలు వెలిగించారు.

ఎస్.రాయవరం: మండలంలోని పెదఉప్పలం, ఎస్.రాయవరం, సర్వసిద్ధి, దార్లపూడి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో రుద్రాభిషేకాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. రేవుపోలవరం తీరంలో పలువురు పుణ్య స్నానాలు ఆచరించారు. బలిచక్రవర్తి ప్రతిష్ఠించిన పెదఉప్పలం శివాలయంలో స్వామిని వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట సమన్వయకర్త, ఎమ్మెల్యే కంబాలజోగులు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కోశెట్టి వెంకటరమణ, దూళి శ్రీనుబాబు, మైలపల్లి శ్రీనివాసరావు, వమ్మవరం ఎంపీటీసీ బాలం సూరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల యువత అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, నాయకులు శిగటాపు జోగిరాజు, ఇళ్ల సత్యనారాయణ,చెల్లూరి విజయ్‌బాబు,కోశెట్టి రాము, పినపాత్రుని గణేష్,మైలపల్లి రాజారావు పాల్గొన్నారు.

కోటవురట్ల: మండల కేంద్రంలోని శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం, యండపల్లి శివారు శ్రీ ఆత్మలింగేశ్వరస్వామి ఆలయం, పందూరు వరాహనది తీరాన శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం, చిన లింగాపురంలోని శ్రీ దుర్గా మల్లేశ్వర అయ్యప్ప ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా శివునికి క్షీరాభిషేకం, రుద్రాభిషేకాలు చేశారు. ఆలయాలలో జాగరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



పెదఉప్పలం శివాలయంలో స్వామిని దర్శించుకున్న సమన్వయకర్త కంబాల జోగులు



ఏటికొప్పాక శివాలయంలో అభిషేకాల్లో పాల్గొన్న భక్తులు



ఉపమాకలో లక్ష్మణేశ్వరాలయంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



సీతమ్మ కొండపై ఉమా ధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకున్న జియ్యని శ్రీధర్



రేవుపోలవరం తీరంలో పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు



కోటవురట్లలోని శివాలయంలో భక్తులు



మునగపాకలో సాంబశివుడిని దర్శించుకుంటున్న భక్తులు



గణపర్తిలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

మహిళా సాధికారత సీఎం జగన్‌తోనే సాధ్యం



మహిళా ప్రజా ప్రతినిధులను సత్కరిస్తున్న కంబాల జోగులు



అడ్డురోడ్డులో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు

ఎస్.రాయవరం: మహిళా సాధికారిత సీఎం జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయంవద్ద శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని మహిళా ప్రజా ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. క్యాంపు ఆఫీస్‌లో ముందుగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగులు మాట్లాడుతూ మహిళలు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిఅని తెలిపారు.ప్రభుత్వ పథకాలు దాదాపుగా మహిళలు పేరున ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్ డి.వి.సూర్యనారాయణరాజు, ఎస్.రాయవరం ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీలు కాకర దేవి, ఉమాదేవి, మాజీ ఎంపీపీ, చినగుమ్ములూరు ఎంపీటీసీ బొలిశెట్టి శారదాకుమారి, సర్పంచ్ కర్రి హేమలత, గొర్ల విజయ్ లక్ష్మి, నామవరం పీఏసీఎస్ వైస్ పర్సన్ కె.సుందరలత, డీసీసీబీ డైరెక్టర్ సత్యవతి, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు శేషారత్న, అడపా శ్రావణికుమారి, తలె సుజనమ్మ, ఎస్.రాయవరం, నక్కపల్లి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు బొలిశెట్టి గోవిందరావు, శీరం నరసింహమూర్తి,జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దత్తుడు సీతబాబురాజు, వైఎస్సార్ సీపీ నాయకులు లొడగల చంద్రరావు, గొర్ల బాబూరావు,నాగంబోయిన శ్రీనివాసరావు, నల్లపరాజు వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



చీరలు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ కొండలరావు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు



డీఎస్పీ భవ్యారెడ్డిని సత్కరిస్తున్న పోలీస్ సిబ్బంది



దిమిలి గ్రంథాలయంలో నివాళులలిస్తున్న మహిళలు



మహిళా పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న సీఐ అప్పలరాజు, డాక్టర్ శివరాజా ప్రసాద్



మహిళా ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పీఆర్‌టీయూ నేతలు

మునగపాక: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని యలమంచిలి సర్కిల్ డీఎస్పీ భవ్యారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా పోలీసులు విధి నిర్వహణలో కష్టపడి పనిచేసి గౌరవం పెంచుకోవాలని తెలిపారు. ప్రజలతో మమేకం అవుతూ వారి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం మహిళా దినోత్సవ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించారు. యలమంచిలి సీఐ గపూర్,ఎస్ఐ పి.ప్రసాదరావు,మహిళా పోలీసులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాంబిల్లి: మండలంలోని దిమిలి శాఖా గ్రంథాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘ సేవకురాలు మదర్‌థెరిసా, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజిని నాయుడు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ ఎస్.శకుంతల పలువురు మహిళలు పాల్గొన్నారు.

మహిళా పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ

యలమంచిలి రూరల్: పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు పురుషులతోపాటు మహిళా పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని మున్సిపల్ కమిషనర్ కె.ఎ.కొండలరావు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక పురపాలకసంఘ కార్యాలయ ఆవరణలో యలమంచిలి లయన్స్ క్లబ్ శాఖ ఆధ్వర్యంలో మహిళా పారిశుధ్యకార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ప్రజలకు అందజేస్తున్న సేవలు పలువరికి ఉపయోగపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు గుప్తా,బెజవాడ నాగేశ్వరరావు,శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు,లయన్స్ క్లబ్ యలమంచిలి శాఖ అధ్యక్షుడు కుర్రా శంకరగిరి,కుర్రా సత్యవేణి,ఉపాధ్యక్షుడు బండారుసత్య బంగారుశెట్టి, కార్యదర్శి కట్టా బాబ్జి,కోశాధికారి దాచేపల్లి వెంకట పైడిరాజు,ద్వారపురెడ్డి నాగేశ్వర్రావు,పలువురు సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

పాయకరావుపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మహిళా పారిశుధ్య కార్మికులను హైమా నేత్రాలయం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. హైమా నేత్రాలయం వైద్యులు పసగడుగుల శివరాజా ప్రసాద్, సీఐ పి.అప్పలరాజులు మాట్లాడుతూ మహిళా పారిశుధ్య కార్మికుల సేవలు విశేష సేవలందిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా 30 మందిని దుశ్శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల సంఘం సెక్రటరీ సత్తిబాబు, మాస్టర్ అడపా ప్రకాష్, హైమా నేత్రాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు అన్నారు. తిమ్మాపురం కస్తూర్బా విద్యాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, మహిళా ప్రధాన కార్యదర్శి పద్మావతి, కేజీబీవీ ఎస్‌వో లక్ష్మి, పలువురు మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి సీఎం సహాయ నిధి



సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన లక్ష రూపాయల చెక్కును జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు శుక్రవారం పెంటకోటలో అందజేశారు. మండలంలోని కుమారపురం శివారు రత్నయ్యమ్మపేట గ్రామానికి చెందిన రాయుడు నరసింగరావు కుమారుడు తరుణ్ ఏసు దుర్గ కుమార్ చిన్నతనం నుంచి ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నాడు. పిసినికాడలో నిర్వహించిన సమావేశానికి హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని గురువారం ఏసుదుర్గ కుమార్ తల్లిదండ్రులు కలిసి తమ కుమారుడిని పరిస్థితిని వివరించారు. దీంతో సీఎం జగన్ మోహన్ రెడ్డి స్పందించి ఆర్థికసాయం అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. వెంటనే సీఎం సహాయ నిధి నుంచి రూ.లక్ష మంజూరు చేశారు. ఆ చెక్కును రాయుడు నరసింగరావు దంపతులకు శుక్రవారం చిక్కాల రామారావు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పన్నీరు పాపారావు, నాయకులు గెడ్డమూరి శ్రీనివాసరావు, నీలాపు బాలకృష్ణారెడ్డి, యజ్జల సత్యనారాయణ, పల్లేల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం

అనకాపల్లి : స్థానిక విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఊరేగింపు రథాన్ని కార్పెంటర్ సంఘం పట్టణ అధ్యక్షుడు వానపల్లి కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు కోసూరి మన్మథరావు ప్రారంభించారు. ప్రతి ఏడాది మహా శివరాత్రి రోజు స్వామివారి రథం ఊరేగింపు ఉంటుందన్నారు. రాత్రి 8 గంటలకు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబ కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. కామాక్షి కార్పెంటర్ సంఘం ప్రధాన కార్యదర్శి సింహాద్రి కోటేశ్వరరావు, కోశాధికారి మునాసల రామకృష్ణ, వివిధ కార్పెంటర్ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.